క్లుప్తంగా

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



హర్షిత్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: నీట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన హర్షిత్‌కు 720 మార్కులకు గాను 609 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 22వ స్థానాన్ని సాధించుకున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అభినందిస్తూ చిరు సత్కారం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి హర్షిత్‌ని ఆదర్శంగా తీసుకుని ఆసక్తితో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి రోద్ద గోపి, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, కుసుమ, తమీన్, గురు సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో మంటలు



డంపింగ్ యార్డులో మండుతున్న వ్యర్థాలు

సత్యవేడు: శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమల నుంచి వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ చేసి పంపుతున్న డీలర్లు, సబ్ డీలర్లకు డంపియార్డులు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. స్థానికులు కొందరు గ్రామ సమీపాల్లోనే నిబంధనలకు విరుద్ధంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్థానికులకు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. మంగళవారం చెంగంబాకం గ్రామ సమీపంలో డంపింగ్ చేసిన వ్యర్థాలకు నిప్పు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. శ్రీసిటీలోని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పింది. ఊరి సమీపంలో డంపింగ్ యార్డులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు.. వదిలేసిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకుని వదిలేసిన ఇసుక ట్రాక్టర్లు

నాగలాపురం: ఇసుక మాఫియా ఆగడాలు రోజు రోజుకూ పెరిగి పోతున్నాయి. మండలంలోని చిన్నపట్టు వద్ద అరణియార్ నదిలో రాత్రి 11 గంటలకు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు నామమాత్రంగా ట్రాక్టర్లపై ఎటువంటి కేసు నమోదు చేయకుండా జరిమానాలు విధించి వదిలిపెట్టేయడం గమనార్హం.


కలుషిత నీటివల్లే డయేరియా



చెన్నేరిలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

సత్యవేడు: కలుషిత నీటి వల్ల డయేరియా సంక్రమించే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటిని తాగడం లేదా పరిశుభ్ర నీటిని తాగడంతో డయేరియాలాంటి వ్యాధులను అరికట్టవచ్చని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ తెలిపారు. చెన్నేరిలో మంగళవారం అతిసార నియంత్రణపై ర్యాలీ నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి జూలై 31 వరకు డయేరియాపై మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పిల్లలకు మూడు కంటే ఎక్కువ సార్లు విరేచనాలు అయితే డయేరియాగా భావించి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు సమీపంలోని వైద్యశాలలో తీసుకొని పిల్లలకు అందించాలన్నారు. చిన్న పిల్లలకు సరైన పోషకాహారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఎస్. సుబ్రమణ్యం, సిబ్బంది వి.నాగజ్యోతి, మురళి, వనజ, ఝాన్సీ గౌరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా అరుణ



నారాయణవనం: ఎంపీడీవోగా అరుణ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పనిచేసిన గంగాభవాని పదోన్నతి పొందడంతో కార్యాలయ ఏవో గుణశేఖర్ దాదాపు 20 మాసాల పాటు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేశారు. బాధ్యతలు తీసుకున్న అరుణ విలేకరులతో మాట్లాడుతూ అందరినీ సమన్వయ పరుస్తూ, మండల అభివృద్ధి, మౌళిక సౌకర్యాలు, పారిశుధ్యం, తాగునీటి పంపిణీపై శ్రద్ధ చూపిస్తామన్నారు.

బడుల కోసం పోరాటం

ప్రభుత్వ బడులను మోడల్ స్కూళ్లుగా మార్చి ప్రైమరీ పాఠశాలను ఆయా మోడల్ స్కూళ్లలో విలీనం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ గ్రామాల్లో నడుస్తున్న పాఠశాలలను పాత పద్ధతిలోనే నడపాలని కోరుతూ పాఠశాలలకు తాళాలు వేసి నిరసనకు దిగుతున్నారు. నాలుగేళ్ల పిల్లలను ఆరు కిలోమీటర్ల దూరమున్న బడులకు తమ బిడ్డలను పంపలేమంటున్నారు. ప్రభుత్వ బడులను పూర్తిగా రద్దుచేసి, ప్రైవేట్ బడులకు లబ్ధి చేకూర్చడమేనని కూటమి ప్రభుత్వంపై విద్యార్థుల తల్లిదండ్రులు దుమ్మెత్తి పోస్తున్నారు.

- 9 పాఠశాలలకు తాళం వేసిన జనం
- రోడ్డెక్కిన విద్యార్థుల తల్లిదండ్రులు
- కేవీబీపురంలో తొమ్మిది పాఠశాలలకు తాళం వేసిన జనం



ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బంగారమ్మకండ్రిగ, గురుకులకండ్రిగ ప్రజలు



మహదేవపురం పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కేవీబీపురం: మండలంలో సుమారు 39 పంచాయతీల్లో 79 ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయి. 79 బడులకు గాను సుమారు 1600 మందికి పైగా పేద విద్యార్థులు ప్రైమరీ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరంతా స్థానికంగా పేదరికం ఊబిలో కూరుకుపోయిన వారే. స్థానిక ప్రభుత్వ బడుల్లో ఉచిత విద్యను అభ్యసించడమే వీరికి ఉన్న మార్గం. గత 30, 40 ఏళ్లుగా గ్రామాల్లో నడుస్తున్న పాఠశాలలను విలీనం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరంతా చదువులకు దూరం కావల్సిన పరిస్థితి వచ్చింది.

- మండలంలోని గురు కులకండ్రిగ, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఉన్న ప్రైమరీ పాఠశాలల్లో సుమారు 53 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ రెండు బడులను ఆయా గ్రామాలకు సుమారు 7 కిలోమీటర్ల దూరంలోని కర్లపూడిబడిలో విలీనం చేశారు. కనీసం వాహన సదుపాయం కూడా లేని ఊర్ల నుంచి తమ బిడ్డలను ఏడు కిలోమీటర్లు పంపించడం ఎలా సాధ్యపడుతుందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు గురుకులకండ్రిగ బడికి తాళం వేసి ఆందోళనకు దిగారు.
- బంగారమ్మ కండ్రిగ ప్రైమరీ పాఠశాలలో 27 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలను సుమారు 4కిలోమీటర్ల దూరంలో ఉన్న, కనీసం రోడ్డు మార్గం లేని ఎస్ఎన్ కండ్రిగలోని పాఠశాలలో విలీనం చేశారు. చినుకు పడితే కనీసం అడుగు వేయలేని అటవీమార్గంలో తమ బిడ్డలు బడికి వెళ్లాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మండల విద్యాశాఖా కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగి ఎంఈఓకు వినతి పత్రాన్ని అందించారు.
- తిమ్మసముద్రంలో గత పాతికేళ్లుగా నడుస్తున్న పాఠశాలను రాగిగుంట జెడ్పీ పాఠశాలలో విలీనం చేశారు. దీంతో తమ గ్రామంలో ఉన్న బడిని కొనసాగించాలని కోరుతూ పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు.
- మహదేవపురం, కొట్టాలమిట్ట గ్రామాలకు అందుబాటులో ఉన్న ప్రైమరీ పాఠశాలను కేవీబీపురం జెడ్పీ పాఠశాలలో విలీనం చేశారు. మహదేవపురం నుంచి కేవీబీపురం పాఠశాలకు సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉంది. లోకం తెలి యని చిన్నారులను బస్సులు, ఆటోల్లో ప్రయాణించి పాఠశాలకు భద్రంగా చేరుతారా అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. దీంతో మహదేవపురం పాఠశాలకు తాళం వేసి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లిపోయారు.
- కొట్టాలమిట్ట గిరిజన కాలనీ పాఠశాలను కేవీబీపురం జెడ్పీ పాఠశాలలో విలీనం చేశారు. సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి ఇప్పటికీ సరైన రోడ్డు మార్గం లేదు. వర్షాలు పడితే ఇక ఇల్లుదాటే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తమ బిడ్డలను ఎలా బడులకు పంపాలో తెలియక అడవిబాట పట్టిస్తున్నామన్నారు.
- మండలంలోని జ్ఞానమ్మకండ్రిగ పాఠశాలలో 21 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలను సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆరె పాఠశాలలో విలీనం చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు బడికి తాళం వేసి, ఉపాధ్యాయులను అక్కడి నంచి పంపించేసి, పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లిపోయారు.



జ్ఞానమ్మకండ్రిగ పాఠశాలకు తాళం వేస్తున్న గ్రామస్తులు

ఆపద సమయంలో గుర్తొచ్చిన జగనన్న

బడుల విలీనం ప్రక్రియలో భాగంగా నెలకొన్న పరిస్థితులతో ప్రజలు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుర్తు చేసుకున్నారు. గత ప్రభుత్వంలో పది మంది ఉన్న పాఠశాలలను కూడా జగన్ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేసిందని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పాఠశాలల విలీనం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీపతిని వివరణ కోరగా అది ప్రభుత్వ నిర్ణయమేనని, తాము చేయగలిగింది ఏమి లేదన్నారు. అయితే ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

పాఠశాల కోసం విద్యార్థుల ధర్నా



ఎంఈవోలకు వినతి పత్రాన్ని అందిస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

నారాయణవనం: మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ దళితవాడలోని ఆరు, ఏడు తరగతులను గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల వద్ద ధర్నా చేశారు. అనంతరం గ్రామ సచివాలయం, ఎంపీడీవో కార్యాలయాల వద్ద ధర్నా చేసి విద్యాశాఖాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ 1980లో ప్రారంభమైన ప్రాథమిక పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాల స్థాయికి ఎదిగిన పాఠశాలలో 56 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయి తగ్గింపుపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినా స్పందన లేదని వాపోయారు. అనంతరం ఎంఈవోకు వినతి పత్రం సమర్పించారు. దళితవాడకు చెందిన ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలను మూసి వేయడం తగదు



మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: విలీనం పేరుతో స్థానికంగా ఉన్న పాఠశాలలను మూసివేసి, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం తగదని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, అన్ని వర్గాలను మోసం చేస్తూ, ఆఖరికి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా 7 మండలాల్లో సుమారు 70 పాఠశాలలను మూసివేస్తున్నారని తెలిపారు. తద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నిత్యం నిరసనలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట వేసి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుడితే కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు విద్యాశాఖా మంత్రి లోకేష్ ఉన్న పాఠశాలలను విలీనం పేరుతో మూసివేస్తున్నారని చెప్పారు. ఈ నిర్ణయంపై మంత్రి లోకేష్ తక్షణమే పునరాలోచన చేయాలని, విలీన నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

టోకెన్ పద్ధతిని పాటించండి



గుజ్జు పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్

రేణిగుంట: మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమల వద్ద టోకెన్ పద్ధతిని పాటించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశ్రమల యజమానులకు సూచించారు. మండలంలోని ఎస్ ఎన్ పురం గ్రామంలోని శ్రీ వర్ష ఫుడ్ ప్రొడక్ట్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన మామిడి పండ్ల గుజ్జు పరిశ్రమ కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. పరిశ్రమలో మామిడి కాయల నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం అక్కడే ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీడీ సతీష్, మార్కెటింగ్ ఏడీ సురేంద్ర బాబు, తహసీల్దార్ సురేష్ బాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల నిరసన

రేణిగుంట: ఇజ్రాయిల్ మారణకాండ ఆపాలని సీపీఎం సీనియర్ నాయకులు వెంకటరమణ అన్నారు. జూన్ 17న పాలస్తీనా సంఘీభావ దినం సందర్భంగా వామపక్షాలు మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు నిరసనకు దిగాయి. కార్యక్రమంలో ఆవాజ్ సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్.షా నవాజ్, సీపీఐ నాయకులు తులసి రాజన్, సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్, మహమ్మద్ వల్లి, కరీముల్లా, బాషా, నిజాముద్దీన్, దిలీప్ బాషా, ఆషా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జూలియన్ రాజు పాల్గొన్నారు.

పానగల్ గంగమ్మకు సారె

శ్రీకాళహస్తి: పానగల్‌లో వెలసిన గంగమ్మకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ముక్కంటి సారెను మంగళవారం అందజేశారు. బుధవారం జాతర జరగనున్న నేపథ్యంలో ఈ సారెను అందజేశారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జీర్ణోద్ధరణ పనులు అద్భుతం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆధునీకరణ అద్భుతమని పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఆయన మంగళవారం ఆలయాన్ని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయ జీర్ణోద్ధారణకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం 2వేల మంది భక్తులు కొండపై ఉండే విధంగా నిర్మించినట్లు తెలిపారు. ఆయనతోపాటు సురేష్, హరినాథ్‌నాయుడు, బాలాజీ, భాను, ప్రసాద్, ఈశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల పరిశీలన



నిషేధిత భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్మయి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నిషేధిత భూముల రికార్డులను సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థల నుంచి కొనుగోలు చేసిన భూముల స్థలాలను 22ఏలో ఉన్న నిషేధిత భూముల జాబితాలో మండలంలోని ఆలత్తూరు గ్రామంలో ఉన్న వేనాటి పుష్పమ్మకు సంబంధించిన భూమితో పాటు మరో 20 మంది రైతుల భూములు సర్వే నెంబర్ 303లో 135 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయి. ఆ భూముల రికార్డులను పరిశీలించి, రికార్డుల ఆధారంగా అర్హత కలిగిన రైతులకు ఆ భూములను సొంతం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపింది. ఆమె వెంట తహసీల్దార్ శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు, ఆర్ఐ నల్లయ్య, వీఆర్వోలు భాస్కర్, తిరుమలేష్ ఉన్నారు.

మహిళల సమస్యలపై తక్షణమే స్పందించాలి



వైఎస్ జగన్‌ను కలిసిన మాధవి రెడ్డి

కేవీబీపురం: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి, వైఎస్సార్ సీపీ తరపున బాధితులకు అండగా నిలవాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు మాధవి రెడ్డికి సూచించారు. ఆమె తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గౌరవపూర్వకంగా కలిశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన ఆమె పార్టీ అధినేతను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

శ్రీకాళహస్తి: వ్యాపారం, ఖనిజ వనరుల దోపిడీ, సామ్రాజ్య వాదమే లక్ష్యంగా చిన్న దేశాలపై అమెరికా చేయిస్తున్న సైనిక దాడులు విరమించుకోవాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి అన్నారు. ఇజ్రాయిల్ చేస్తున్న పాశవిక దాడులకు వ్యతిరేకంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ అగ్రరాజ్యం అమెరికా ప్రోద్బలంతో గాజాపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న దాడులను వెంటనే ఆపాలని కోరారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, నాయకులు పెనగడం గురవయ్య, అన్వర్ బాషా, గురునాథం, ఈశ్వరయ్య, రాజా పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాలని కోరారు. జూనియర్ కళాశాలలో ఆంగ్లం, తెలుగు మీడియంలలో బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు చేరేందుకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఉచితంగా అందజేస్తామన్నారు. మధ్యాహ్న భోజన వసతి ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

స్కూల్ బస్సుల తనిఖీ



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ విశ్వనాథ నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులను ఎస్ఐ విశ్వనాథ నాయుడు మంగళవారం మండల కేంద్రంలో తనిఖీ చేశారు. బస్సుల రికార్డులను, ఫిట్‌నెస్ వివరాలను పరిశీలన చేశారు. అనంతరం డ్రైవింగ్ లైసెన్సులను తనిఖీ చేసి బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేపట్టాలని, అతివేగంగా బస్సులను నడపవద్దని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు.

గ్రామీణ శ్రామికుల సర్వే



సర్వేలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తొట్టంబేడు: మండలంలోని తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి గ్రామంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికుల సర్వే కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య పాల్గొన్నారు. మొదటగా శ్రీకాళహస్తి సీఐటీయూ ప్రాంతీయ సభ్యులు ఐదు బృందాలుగా విడిపోయి కల్లిపూడి గ్రామంలో ఉన్న 150 కుటుంబాలను కలిసి వారి జీవనంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ ఈ గ్రామంలో నివసించే ప్రతి ఒక్కరూ ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ వారి వారి కుటుంబాలను నెట్టుకొస్తున్నారని అన్నారు. వీరికి పంటలు పండించడానికి భూములు లేవని చెప్పారు. ఈ గ్రామంలో నివసించే వారికి వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సీపీఎం పట్టణ బాధ్యుడు గంధం మనీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్, గురునాథం, రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్‌లో గ్రామం పేరు రావడం లేదు



తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ శిరీషా

సత్యవేడు : మండలంలోని అలిమేలు మంగాపురం పంచాయతీ ప్రజలు తీసుకున్న సర్టిఫికెట్లో రెవెన్యూ గ్రామంగా ఉన్న మదనంబేడు పేరు వస్తోందని ఏఎం పురం సర్పంచ్ ఎం.శిరీషా తహసీల్దారు రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ శిరీషా, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు రెడ్డితో కలసి మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ మదనంబేడు రెవెన్యూ గ్రామంలోని అలిమేలు మంగాపురం పంచాయతీలో నివసిస్తున్న ప్రజలకు క్యాస్టు, నేటివిటీ, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ సర్టిఫికెట్లలో నివాసం ఉంటున్న పంచాయతీ అలిమేలు మంగాపురం ఊరు పేరు కాకుండా మదనంబేడు పేరు వస్తోందని చెప్పారు. అలిమేలు మంగాపురం గ్రామస్తుల పిల్లలకు ఇస్తున్న సర్టిఫికెట్లలో అదే ఊరు పేరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరారు.

మామిడి రైతులను ఆదుకుంటాం



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నారాయణవనం: జ్యూస్ ఫ్యాక్టరీల ద్వారా మామిడిని కొనుగోలు చేయించి నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ మామిడి రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని టాసా జ్యూస్ ఫ్యాక్టరీని మంగళవారం సాయంత్రం ఆయన సందర్శించి రైతులు, అధికారులు, యాజమాన్యంతో చర్చించారు. రోజుల తరబడి ఫ్యాక్టరీ ఎదుట వేచిఉన్నామని, మామిడి కాయలు పాడైపోతున్నాయని రైతులు కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు. ఫ్యాక్టరీ సమీపంలో జాతీయ రహదారిపై ఆగివున్న సుమారు వందకు పైగా వాహన డ్రైవర్లు, రైతులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ఫ్యాక్టరీ లోపలికి వెళ్లి పరిశీలించిన కలెక్టర్ యాజమాన్యంతో మాట్లాడుతూ రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మూడు రోజులుగా వేచి ఉన్న రైతుల నుంచి తక్షణం మామిడిని కొలుగోలు చేయాలని ఆయన యాజమాన్యాన్ని ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ జయరాములు, ఎంపీడీవో అరుణ, ఏవో శోభారాణి, ఎస్ఐ రాజశేఖర్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్షరాభ్యాసానికి పలకల అందజేత



పలకలు, బలపాలు అందజేస్తున్న ముని మహేష్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన పెట్రోల్ బంక్ నిర్వాహకుడు మునిమహేష్ మంగళవారం ఈవో బాపిరెడ్డికి పలకలు, బలపాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.